మూగజీవికీ బతుకునిద్దాం

- వేసవి సెగలతో విలవిల
- జాగ్రత్తలతో సంరక్షణ



సర్పవరం గోశాలలో వేసవి ఎండలోనూ పచ్చటి గ్రాసం మేస్తున్న ఆవులు

కాకినాడ రూరల్: సూరీడు రోజురోజుకూ విజృంభిస్తున్నాడు. జీవరాశుల్లో సత్తువనంతా పీల్చి పిప్పిచేస్తున్నాడు. ఎప్పుడు ఎవరు రాలిపోతారో తెలియని అశక్తతతో ప్రాణాలు ఉగ్గబట్టుకుని కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి. పల్లెలు పట్టణాలను తలపిస్తూ కాంక్రీట్ జంగిల్స్‌గా మారిపోతున్న తరుణంలో పశుపక్ష్యాదులకు గుక్కెడు నీటితో గొంతు తడుపుకోవడానికి అవకాశం లేని పరిస్థితి. వాటిని గాలికి వదిలేయకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవలసిన బాధ్యత యజమానులపై ఎంతైనా ఉంది.

మండలంలో తిమ్మాపురం, పండూరు పశువైద్యశాలల పరిధిలో సుమారు 18 గ్రామాల్లో గేదెలు 7900, ఆవులు 2వేలు ఉన్నాయి. పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరగడంతో పశువుల సంరక్షణ కత్తిమీద సాముగా మారింది. కాకినాడలో గురువారం 38 డిగ్రీల సెల్సియస్ నమోదవ్వడంతో రానున్న రోజుల్లో 40, ఆపై నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం రబీ సీజన్ ముగింపు దశలో ఉండడంతో పచ్చిక గ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉంది. కేవలం వట్టి గడ్డితో పాటు దాణాపైనే ఆధారపడాల్సి ఉంది.

పశువులను సంరక్షిద్దామిలా..

- పశువులకు నీటిని అందుబాటులో ఉంచాలి.
- ఇండ్ల వద్ద, పశు సంచారం ఉన్నచోట నీటి కుండీలు ఏర్పాటు చేయాలి.
- ఉదయం, సాయంత్రం చల్లని నీటితో కడగాలి.



కాకినాడ రూరల్ తమ్మవరం గ్రామంలో పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి కుండీ

- పశువుల శాలలో చుట్టూ గోనెలు ఏర్పాటు చేసి తడపాలి.
- ఎండు గ్రాసం, దాణా అందుబాటులో ఉంచుకోవాలి.



బోట్‌క్లబ్ వద్ద ఉమర్ ఆలీషా సంస్థ ఏర్పాటు చేసిన పశుపక్ష్యాదుల చలివేంద్రం

సర్పవరంలో గో సంరక్షణ

సర్పవరం గ్రామంలోని భావనారాయణ స్వామి గోశాలలో దాతల సహకారంతో గో సంరక్షణ చేస్తున్నారు. ఇక్కడ 60 ఆవులు ఉండగా, గ్రామానికి చెందిన పుల్ల చంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ పుల్ల చందు దాణా సమకూర్చడంతో పాటు గోశాల వద్ద పొలంలో పశువులు కోసం గ్రాసం పెంచుతున్నారు. గోవుల సంరక్షణకు దాతలతో పాటు, ఆలయ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు తెలిపారు.

పశుపక్ష్యాదుల కోసం చలివేంద్రం

కాకినాడ-పిఠాపురం రోడ్డులో సర్పవరం జంక్షన్ సమీపంలో బోట్‌క్లబ్‌ను ఆనుకుని ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రంతో పాటు పశు, పక్ష్యాదులకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడకు పక్షులు వచ్చి దాహార్తి తీర్చుకోవడంతో పాటు ఆహారం తీసుకుంటున్నాయి.

నీటి కుండీల ఏర్పాటుతో పాటు సబ్సిడీపై దాణా..

గ్రామాల్లో నీటి కుండీలు ఏర్పాటు చేయాలని మండల పరిషత్ అధికారులను కోరుతున్నాం. ఇప్పటికి 10 గ్రామాల్లో కుండీలు ఉన్నాయి. మరో 8 గ్రామాల్లో నీటి కుండీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. పశు దాణాను ప్రభుత్వం ద్వారా కిలో రూ.6.5కు అందిస్తున్నాం. ఆర్‌బీకేల్లో మరో పది రోజుల్లో అందుబాటులో ఉంటుంది. పశువుల సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలి. వాడగాల్పుల బారిన పడకుండా చూసుకోవాలి.

– ఎం.రాజ్యలక్ష్మి, పశువైద్యాధికారిణి, పండూరు, కాకినాడ రూరల్

విద్యార్థులూ.. 25వ తేదీలోగా చేరండి..

కాకినాడ సిటీ: ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి కేటాయించిన 25 శాతం ఉచిత సీట్లుకు ఎంపికైన అభ్యర్థుల జాబితాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ కేవీఎస్ అన్నపూర్ణ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల జాబితాను గ్రామ సచివాలయాలు, ఎంఈఓ కార్యాలయాల్లో ఉంచినట్లు తెలిపారు. ఆయా విద్యార్థులు ఈనెల 25వ తేదీలోపు అడ్మిషన్లు పొందాలన్నారు. అన్ని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు సదరు విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్చుకుని ఆయా వివరాలను సంబంధిత ఎంఈఓకు అందించాలని డీఈవో వివరించారు.

ఉపాధిని సద్వినియోగం చేయాలి

కరప: ఉపాధి పథకం అమలులో అవకతవకలను అరికట్టి, అందరికీ పనికివచ్చేలా పనులు చేయించాలని రాష్ట్రీయ హిందూ చైతన్య సదస్సు అధ్యక్షుడు పడాల రఘు కోరారు. నడకుదురులో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో ఉపాధి పనులు కొందరికి కామధేనువులా ఉండేవని, బీజేపీ ప్రభుత్వంలో అందులో అవినీతిని అరికట్టే చర్యలు తీసుకుంటోందని అన్నారు. రైతులకు వ్యవసాయ కూలీలు అందుబాటులో లేక, అధిక కూలి ఇచ్చి వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సామాన్యులు ఇంటి నిర్మాణంలో కూలీలకు అధికరేట్లు చెల్లించలేక నిర్మాణ పనులు నిలిపివేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. అందరికీ మేలుజరిగేలా వ్యవసాయ, గృహ నిర్మాణ పనులకు ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తే ఆ పథకం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



పెద్దాపురప్పాడులో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

కరప: మండల పరిధిలో సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, గృహసారథులు, గ్రామసచివాలయ కన్వీనర్లు, గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ వలంటీర్లు, పార్టీ శ్రేణులతో కలసి ×జగనన్నే మా భవిష్యత్Ž ఉత్సాహంగా నిర్వహించారు. పెద్దాపురప్పాడు, వేములవాడ, సిరిపురం, కొరిపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ పాలనా దక్షత, అందుతున్న పథకాలు, సంక్షేమం, అదే క్రమంలో గత టీడీపీ పాలనలో వంచనకు గురైన విధానంపై వివరించారు. ఈ సంక్షేమం కొనసాగాలంటే జగనే మళ్లీ సీఎం కావాలని కోరుతూ ఇళ్లపై జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను అతికించుకున్నారు. తమ మొబైల్ ఫోన్ల నుంచి మిస్డ్‌కాల్స్ ఇచ్చి జగనన్న పాలనకు మద్దతు ప్రకటించారు.

సేవా ప్రపంచ సృష్టికర్త పాల్ హారిస్



పాల్ హారిస్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పద్దరాజు

బోట్‌క్లబ్: అంతర్జాతీయ రోటరీ సంస్థను 1905లో ప్రారంభించడం ద్వారా దేశాల మధ్య సేవాభావాలను పెంపొందించడంతో రోటరీ వ్యవస్థాపకులు పాల్ హారిస్ జన్మ ధన్యమని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ చోడిశెట్టి పద్దరాజు అన్నారు. పాల్ హారిస్ జయంతి సందర్భంగా స్థానిక రోటరీక్లబ్ వృద్ధాశ్రమంలో ఉన్న ఆయన విగ్రహానికి గురువారం పూలమాలలు వేశారు. 117 ఏళ్ల క్రితం స్థాపించిన క్లబ్‌తో ప్రపంచంలో అందరిలోనూ స్నేహ సంబంధాలు పెరిగాయన్నారు. అనంతరం రోటరీ వృద్ధాశ్రమంలోని సభ్యులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ హాస్పిటల్ అధినేత రామానందరెడ్డి, వృద్ధాశ్రమ కమిటీ చైర్మన్ ఉదయభాను, కార్యదర్శి సత్తి రవిరెడ్డి, సభ్యులు సుబ్రహ్మణ్యం, కోటగిరి నాని, పబ్బినీడి కృష్ణ, గోపీనాథ్ పాల్గొన్నారు.

గడువులోగా సర్వే పూర్తి చేయండి : ఆర్డీఓ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష రీ సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆర్డీవో బీవీ రమణ అన్నారు. గురువారం డివిజనల్ స్థాయి సమావేశం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించి మాట్లాడుతూ సరిహద్దు సర్వే రాళ్లను వేగంగా పాతాలని, మ్యుటేషన్, భూ మార్పిడి, స్పందన దరఖాస్తులపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పరిపాలనాధికారి వరహాలయ్య, సత్యనారాయణ, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

బీజేపీని సాగనంపుదాం



ఇంటింటా కరపత్రాలు పంచుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ, సీపీఎం కమిటీల పిలుపు మేరకు ఆయా పార్టీల నాయకులు గురువారం స్థానిక దుమ్ములపేటలో పాదయాత్ర నిర్వహించి కరపత్రాలు పంచారు. సీపీఐ నాయకులు తాటిపాక మధు, సీపీఎం నాయకులు ఎం వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల సరకుల ధరలు పెంచుతూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని, ప్రజలు ఇప్పటికైనా కళ్లు తెరిచి మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు జి.లోవరత్నం, ఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోర్లమ్మ జాతర

పెద్దాపురం: మండలంలోని చదలాడ గ్రామ దేవత చింతాలమ్మ తల్లి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. మేళ తాళాలు, బాణసంచా నడుమ జాతరను ఆలయ కమిటీ వైభవంగా నిర్వహించారు. చదలాడ, తిరుపతి, ఉలిమేశ్వరం తదితర గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్లింల ఆదరణ మరువలేనిది



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

ఇఫ్తార్ విందులో ద్వారంపూడి

కాకినాడ: రాజకీయ జీవితంలో ముస్లిం మైనార్టీల ఆదరణ ఎప్పటికీ మరచిపోలేనని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం ఎంఎం ఫంక్షన్‌హాలులో గురువారం జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ద్వారంపూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహానేత వైఎస్సార్, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి ఎంతో తోడ్పడ్డారన్నారు. వైఎస్ హయాంలో నిర్మించిన షాదీఖానాలో ఇప్పుడు ఇఫ్తార్ విందు జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. ముస్లింలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మక్కామసీదు అధ్యక్షుడు ఖాజా మోహిద్దీన్, కార్యదర్శి ఖాజా మెయినుద్దీన్, కమిటీ సభ్యులు జకీర్, ముబారక్, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మైనార్టీ సెల్ ప్రాంతీయ సమన్వయకర్త అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్లు ఎంజీకే కిశోర్, బొబ్బా రమణ, చవ్వాకుల రాంబాబు, సంగాని నందం, పసుపులేటి వెంకటలక్ష్మి, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలీద్‌బిన్ వలీ, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రెహమాన్‌ఖాన్, పలువురు ముస్లిం ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కొవ్వాడలో గడప గడపకూ



ఇంద్రపాలెం మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా మండలంలోని కొవ్వాడలో అధికారులతో కలసి గురువారం ఇంటింటికీ ఎమ్మెల్యే కన్నబాబు పర్యటించారు. ప్రభుత్వం ద్వారా పొందిన పథకాలను లబ్ధిదారులకు వివరించి అందుకు సంబంధించిన వివరాలతో కూడిన బుక్ లెట్లను అందించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. ఎమ్మెల్యే కురసాల మాట్లాడుతూ చెప్పాడంటే చేస్తాడు అన్నట్టు ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి సీఎంగా తూచ తప్పకుండా అమలు చేసి దేశంలోనే ఆదర్శవంతంగా నిలిచారన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ ప్రకారం డీబీటీ ద్వారా నేరుగా సొమ్ములు అందించారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా నవరత్న పథకాలు అమలు చేసిన సీఎంను ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యేగా మరోసారి తనకు అవకాశం ఇవ్వాలన్నారు. ఇళ్ల పట్టాలు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు గ్రామస్తులు తెలియజేయడంతో వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీపీ గోపుశెట్టి పద్మజ, కురసాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ తోటకూర శ్రీను, జాన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వాడలో మహిళలకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటాం

ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా మండలంలోని ఇంద్రపాలెం గ్రామంలోని మసీదులో గురువారం రాత్రి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లింలకు ఎమ్మెల్యే కన్నబాబు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తూ పరిపాలన సాగిస్తున్నారని, ముస్లింలకు పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు. మసీదు పెద్దలు వైఎస్సార్ సీపీ నాయకులు కురసాల సత్యనారాయణ, కరీం బాషా తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి వేసవి ఉపశమన సామగ్రి వితరణ



ఎస్ఐకి సామగ్రిని అందజేస్తున్న వీరభద్రారెడ్డి, చంద్రకళాదీప్తి, పక్కన ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేలా ట్రాఫిక్ పోలీసులకు రాగిరెడ్డి వెంకట జయరాం కుమార్ (ఫ్రూటీకుమార్) చారిటబుల్ ట్రస్టు పలు ఉపకరణాలను అందజేసింది. అర్బన్ ట్రాఫిక్-1, ట్రాఫిక్-2 పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 160 మంది సిబ్బందికి రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, రాగిరెడ్డి అరుణ్‌కుమార్ సమకూర్చిన రూ.70 వేలు విలువైన సామాగ్రిని ఎస్పీ సతీష్‌కుమార్ సమక్షంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అందజేశారు. ఎండ నుంచి రక్షించే టోపీలు, వాటర్ బాటిళ్లు, చలువ కళ్లద్దాలు, ఓఆర్ఎస్ ద్రవాల డబ్బాలు అందజేశారు. వీరభద్రారెడ్డి, చంద్రకళాదీప్తి మాట్లాడుతూ పోలీస్ సిబ్బందిని తమ కుటుంబసభ్యులుగా భావిస్తామని, వారి సేవకు ట్రస్ట్ తరఫున అన్ని వేళల్లోనూ ముందుంటామని తెలిపారు. వితరణలో కీలకంగా వ్యవహరించిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చైతన్యకృష్ణను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఎస్‌బీ డీఎస్పీ అంబికా ప్రసాద్, ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వరరావుతో పాటు జిల్లా కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే కన్నబాబు పరామర్శ



రాజభూషణ్ కుమార్ ఆదరణ కూడికలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నబాబు, సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: కుటుంబ సభ్యులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న పలు కుటుంబాలను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం పరామర్శించారు. మండలంలోని రమణయ్యపేట ఏపీఎస్పీ సమీపంలో కారుకొండ మనోహర రాజభూషణ్ కుమార్ అనారోగ్యం మంగళవారం సాయంత్రం మృతి చెందడంతో ఆదరణ కూడికలో పాల్గొని నివాళులర్పించారు. సర్పవరంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఇంజరపు అప్పారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన కాళ్ల శ్రీనివాస్ తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, పుల్ల కోటేశ్వరరావు, పుల్ల చందు, జంగా గగారిన్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బేబీ షో



చిన్నారులకు బహుమతులు అందజేసిన శారద, డాక్టర్ అనుపమ, జాహ్నవి

బాలాజీచెరువు: రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రోటరీ హాల్లో నిర్వహించిన వెల్ బేబీ కాంటెస్ట్‌కు చిన్నారులు హాజరయ్యారు. పది నెలల వయసు నుంచి 18 నెలలు, 18 నెలల నుంచి మూడేళ్ల వయస్సుగా విభజించి పిల్లలకు వాకింగ్, ఫొటోజనిక్ ఫేస్, స్మైల్, ఉంగరాల జుట్టు వంటి వాటిని పరిశీలించి బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ జాహ్నవి, ప్రముఖ పిడియాట్రిషియన్ డాక్టర్ టి.అనుపమ హాజరై ఇటువంటి వాటిల్లో తమ పిల్లలను పాల్గొనేలా ఆసక్తిగా తీసుకువచ్చిన తల్లిదండ్రులకు అభినందదనలు తెలియజేశారు. చిన్నారుల్లో ఆసక్తి గ్రహించి వారిని ఆ మేరకు ప్రోత్సహించాలన్నారు. సామాజిక సేవతో పాటు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్లబ్ అధ్యక్షురాలు సురభి శారదను అభినందించారు.

వైభవంగా నూకాలమ్మ జాతర

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ తల్లి దర్శనానికి గురువారం భక్తులు పోటెత్తారు. 45 రోజుల పాటు నిర్వహించే జాతరలో భాగంగా ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ బందోబస్తు కల్పించారు. సుమారు 20 వేల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శానిటేషన్ అటెన్షన్

- నగరపాలనపై ఐఏఎస్ ముద్ర
- ఆకస్మిక తనిఖీలతో సిబ్బందిలో గుబులు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: పురపాలనపై ఐఏఎస్ ముద్ర కనిపిస్తోంది. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ప్రాధాన్య క్రమంలో ప్రజారోగ్య విభాగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. తెల్లవారక ముందే క్షేత్రస్థాయి తనిఖీలు చేస్తూ సిబ్బందిలో జవాబుదారీ తనాన్ని పెంచుతున్నారు. మస్తరు వేసే విధానం, కార్మికుల పనితీరుపై ఆరా తీస్తున్నారు. దీంతో విధి నిర్వహణలో అలసత్వం వహించే ఉద్యోగుల్లో కలవరపాటు మొదలైంది. ఎప్పుడు ఎవరిపై ఏ చర్యలు తీసుకుంటారోనని అప్రమత్తమవుతున్నారు. తన విధానం ఇలాగే ఉంటుందని ఎంహెచ్‌వో, ఇన్‌స్పెక్టర్లకు తన వైఖరిని చెప్పకనే చెప్తున్నారు.

ఆకస్మిక తనిఖీలు..

కమిషనర్ మహేష్‌కుమార్ గురువారం జగన్నాథపురం, ముత్తానగర్, మహాలక్ష్మినగర్, చిన్నమార్కెట్ ప్రాంతాల్లో పర్యటిస్తూ పారిశుధ్యం అధ్వానంగా ఉండడాన్ని గమనిస్తూనే, సిబ్బంది అలసత్వంపై పద్ధతి మార్చుకోవాలని, పరిస్థితి ఇలానే ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మహాలక్ష్మినగర్, దుమ్ములపేట ప్రాంతాల్లోని మేజర్ డ్రైన్ ఔట్‌లెట్లను పరిశీలించి వర్షాకాలంలో ముంపునకు గురికాకుండా తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఆయన వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీఈ మాధవి, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, ఏఈ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

యూజర్ చార్జీలు చెల్లించండి

మెరుగైన పారిశుధ్య సేవల కోసం ప్రతి నెలా విధిగా యూజర్ చార్జీలను చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెత్త సేకరణకు కార్పొరేషన్ పరిధిలో 106 హైపవర్ టిప్పర్ వాహనాలు, ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటుచేశామని, వాటి నిర్వహణకు నెలకు సుమారు రూ.70 లక్షలు ఖర్చవుతుందని కమిషనర్ తెలిపారు. ఈ మొత్తాన్ని యూజర్ చార్జీల ద్వారా భరించాల్సి ఉంటుందని, వాటిని సకాలంలో చెల్లించకపోతే సేవలకు అంతరాయం కలుగుతుందని, ఆ వ్యయం నగరపాలక సంస్థ సాధారణ నిధులపై పడుతుందని ఆయన అన్నారు. ఈ మేరకు చెల్లింపులకు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

టౌన్‌ప్లానింగ్‌పై సమీక్ష..

పట్టణ ప్రణాళికా విభాగం కార్యకలాపాలపై కమిషనర్ మహేష్‌కుమార్ గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షించారు. డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, టీపీఎస్‌లు హాజరయ్యారు. భవన నిర్మాణ అనుమతులు, అక్రమ కట్టడాలు, ప్రకటన బోర్డులపై ఆదాయం, మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు వంటి అంశాలపై సమీక్షించారు. ముఖ్యంగా జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న అర్బన్ రీ సర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీ

కాకినాడ లీగల్: జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ జిల్లా నుంచి ఐదుగురు జడ్జిలు ఇతర ప్రాంతాలకు వెళ్తుండగా, ఆరుగురు జిల్లాకు బదిలీ అయ్యారు. కాకినాడ నుంచి ఎం.మాధవి చిత్తూరుకు, పి.భరద్వాజ, ఎల్.శారదారెడ్డి నెల్లూరుకు, సీకేవీ సత్యకాంత్‌కుమార్ తిరుపతికి, సి.జానకి చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే డి.శ్రీదేవీ పొన్నూరు నుంచి, ఎ.నాగమల్లేశ్వరి తాడేపల్లిగూడెం నుంచి, నిరూప అనకాపల్లి నుంచి, వి.లీలాశ్యామ్ సుందరి పుత్తూరు నుంచి, ఎస్.ఉషాలక్ష్మీకుమారి పాలకొల్లు నుంచి, షేక్ షరీన్ మైలవరం నుంచి కాకినాడకు రానున్నారు.

కార్మికులూ.. సంఘటితంగా తరలిరండి

కరప: మేడేను విజయవంతం చేసేందుకు మండల పరిధిలోని అసంఘటిత కార్మికులందరూ తరలి రావాలని సీఐటీయు నాయకురాలు సీహెచ్ రమణి కోరారు. స్థానిక సీఐటీయూ భవన నిర్మాణ కార్మికుల భవనంలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, భవన నిర్మాణ కార్మికులు, ఉద్యోగులు పాల్గొనేలా చైతన్యపరచాలన్నారు. మండల సీఐటీయూ నాయకులు ఆర్.వెంకటలక్ష్మి, పి.వరలక్ష్మి, కె.సత్య, డి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ



వృద్ధాశ్రమానికి వాషింగ్ మెషీన్, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

బాలాజీచెరువు: సామాజిక సేవలో కెనరా బ్యాంక్ ఉద్యోగుల సంఘం ముందుంటుందని సంఘ రాష్ట్ర కార్యదర్శి యూవీఎస్ఎస్ హరివర్మ పేర్కొన్నారు. యూనియన్ 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం యూనియన్ వైస్ చైర్మన్ పి.అరుణ ఆధ్వర్యంలో మానవనీయ ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి వాషింగ్ మిషన్, నిత్యవసర వస్తువులు, వంట సామాగ్రి అందజేశారు. అనంతరం అరుణ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక అసమానతలు ఎదుర్కొంటున్న మహిళలు, వయో వృద్ధులకు మెరుగైన వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కమిటీ మాజీ కార్యదర్శి కేవీ రంగారావు, సభ్యులు యు.రాంబాబు, జి.శ్రీధర్, లక్ష్మీ, సూర్య పాల్గొన్నారు.

బీసీలకు ఆరాధ్యుడు సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ అన్నవరం

కాకినాడ: రాష్ట్ర చరిత్రలో బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రగతికోసం అవిశ్రాంతంగా పాటుపడ్డ ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని మండపేట మాజీ సమన్వయకర్త, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ పితాని అన్నవరం పేర్కొన్నారు. అందువల్లే సీఎం జగన్ బీసీల పాలిట ఆరాధ్యుడన్నారు. స్థానిక రమ్య హాస్పటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తన హయాంలో బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకుంటే జగన్ మాత్రం అన్ని రంగాల్లో పెద్దపీట వేశారన్నారు. ముఖ్యంగా శెట్టిబలిజలకు అగ్రపీఠం వేసి రాజ్యసభ కూడా ఇచ్చిన చరిత్ర తమ పార్టీదేనన్నారు. రాజకీయ మనుగడ కోసం జగన్‌ను విమర్శించడం సరికాదన్నారు. 2024, 2029లలో కూడా జగనే సీఎం అన్నారు.